# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 142 క్రిష్ణా, సోమవారం 16 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ఎన్టీఆర్ ట్రస్ట్‌కు చంద్రబాబు శుభాభినందనలు



**అమరావతి, క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 15:** టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ఆశయాలను, సేవలను కొనసాగించేలా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ప్రస్థానం సాగుతోందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ట్రస్ట్ స్థాపించి ఫిబ్రవరి 15తో 29 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 30వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ట్రస్ట్ తరఫున సేవలందిస్తున్న వారికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు. విద్య, వైద్యం, రక్తదానం, విపత్తులో సాయం వంటి కార్యక్రమాలతో ట్రస్ట్ సమాజంపై తిరుగులేని ముద్ర వేసిందన్నారు. తలసీమియా వ్యాధిగ్రస్త చిన్నారులకు నిరంతరం సేవలందించడంలో ఎన్టీఆర్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అసామాన్యం అన్నారు. అత్యంత సమర్థవంతమైన సేవలను ఇచ్చే సంస్థగా ట్రస్ట్‌ను నడుపుతున్న ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరికి, వారి బృందానికి అభినందనలు తెలిపారు.

## బడ్జెట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి:

### టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 15: విశాఖపట్నం,** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇవాళ (ఆదివారం) విశాఖపట్నం నుంచి కూటమి ఎమ్మెల్యేలు, కీలక నేతలతో ఆయన నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో బడ్జెట్ ప్రాధాన్యతలపై సుదీర్ఘంగా చర్చించారు. 'విధ్వంసం నుంచి వికాసం వైపు' సాగుతున్న ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

వ్యవస్థను గాడిలో పెట్టే 'విజన్ డాక్యుమెంట్'

గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను.. మళ్లీ పురోగతి పట్టించేలా ఈ బడ్జెట్ ఉందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత శతాబ్ది ఉత్సవాల నాటికి ఏపీ అగ్రగామిగా ఉండాలనే లక్ష్యంతో (విజన్-2047) ఈ బడ్జెట్ రూపకల్పన జరిగిందని చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ కూడా పాల్గొని.. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ఎలా సమతుల్యం చేస్తోందో వివరించారు.

ఇది గణాంకాల పుస్తకం కాదు.. ప్రజల జీవిత రేఖ: ఎమ్మెల్యే గణబాబు

బడ్జెట్‌పై ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ బడ్జెట్ కేవలం అంకెలతో కూడిన పుస్తకం కాదు, ఇది కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ఒక బ్లూ ప్రింట్. మాటల కోసం కాకుండా, చేతల్లో ప్రగతిని చూపించే విజన్ డాక్యుమెంట్ ఇది.' అని ఆయన వ్యాఖ్యానించారు.

కూటమి నేతలు ఈ సందర్భంగా బడ్జెట్‌లోని కీలక అంశాలను ప్రస్తావించారు. సుమారు రూ. 3.32 లక్షల కోట్లతో కూడిన భారీ బడ్జెట్‌గా పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా సంక్షేమం కోసం దాదాపు రూ. 91,527 కోట్లు కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విద్యా రంగానికి (రూ. 32,308 కోట్లు) అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని పేర్కొన్నారు.

## శివనామస్మరణతో మారుమోగుతున్న పుణ్యక్షేత్రాలు..

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 15:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శైవ క్షేత్రాలు భక్తజనసందోహంతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర నదులు, కోనేర్లలో స్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుంటున్నారు. నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. స్వామి అమ్మవార్ల ప్రభోత్సవం భక్తులకు కనుల విందుగా నిలిచింది. శ్రీశైలంలో ప్రభోత్సవం - నందివాహన సేవ:

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రంలోని ప్రధాన వీధిలో గంగాధర మండపం వద్ద అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రభోత్సవాన్ని ప్రారంభించారు. రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రభపై ఆదిదంపతులు ఊరేగుతుండగా, భక్తులు శివనామ స్మరణతో పులకించిపోయారు.

అనంతరం అక్కమహాదేవి అలంకార మండపంలో శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్లకు నందివాహన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నందివాహనంపై కొలువుదీరిన స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. క్షేత్రంలోని ప్రధాన వీధులన్నీ 'ఓం నమః శివాయ' మంత్రంతో మారుమోగిపోయాయి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏలూరు జిల్లా కైకలూరులో..

కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో వెలసిన శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయ కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుంటున్నారు. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కలిదిండి శివనామస్మరణతో మారుమోగుతోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తుల జాగారం కోసం దేవస్థానం కమిటీ భారీగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. అలాగే, కోనేరు వద్ద భక్తులు తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు (పితృతర్పణం) నిర్వహించారు.

అనంతపురంలో 18 వేల బాన లింగాలకు అభిషేకం..




అనంతపురంలో శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన శివ మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉజ్జయినిలోని నర్మదా నది నుండి సేకరించిన 18,000 బాన లింగాలను ఇక్కడ ప్రతిష్టించారు. భక్తులందరికీ ఈ లింగాలకు అభిషేకం చేసుకునే అరుదైన అవకాశాన్ని కల్పించారు. ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీ ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో భక్తులకు బాన లింగంతో పాటు అభిషేకం కిట్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అరుణాచలం నుండి తీసుకొచ్చిన శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు రేపు ఉదయం వరకూ కళ్యాణోత్సవం, రుద్ర హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో..

ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిమ్మమ్మ మర్రిమాను క్షేత్రంలో శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇక్కడ ఉన్న శివాలయంలో భక్తుల జాగారం కోసం ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పర్యవేక్షణలో భారీ ఏర్పాట్లు చేశారు. మర్రిమాను నీడలో వేలాది మంది భక్తులు జాగారం చేస్తున్నారు. అన్ని క్షేత్రాల్లోనూ తొక్కిసలాట జరగకుండా వాలంటీర్ వ్యవస్థ, పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## చిరువ్యాపారులకు కూటమి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని నాగబాబు హామీ



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 15:** రాష్ట్రంలోని చిరువ్యాపారులకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు భరోసా ఇచ్చారు. పొట్టకూటి కోసం మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్న వలీ అనే చిరు వ్యాపారిని కొందరు భయభ్రాంతులకు గురిచేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇలాంటి సంఘటనలు సమాజానికి మంచివి కాదని ఆయన హితవు పలికారు. ఈ దాడి ఘటన తర్వాత ఎందరో చిరువ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారని నాగబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. దాడి కారణంగా శివరాత్రి నాడు తాను వ్యాపారం చేసుకోలేకపోయానని బాధిత వ్యక్తి వలీ ఆవేదన వ్యక్తం చేయగా, అతనికి వ్యక్తిగతంగా రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించినట్లు నాగబాబు తెలిపారు. వలీ వంటి ఎందరో చిరువ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ దాడిని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా ఖండించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఘటనకు మతపరమైన రంగు పులమవద్దని నాగబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిరువ్యాపారులు విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతపై ఏమైనా సందేహాలుంటే, దానిని పరిశీలించడానికి ఫుడ్ సేఫ్టీ అథారిటీలు ఉన్నాయని, సంబంధిత అధికారులను సంప్రదించాలి తప్ప దాడులకు పాల్పడటం సరికాదని సూచించారు. దేశంలో కోట్ల మంది తక్కువ మూలధనంతో తమ కాళ్లపై తాము నిలబడాలనే సంకల్పంతో వ్యాపారాలు చేస్తున్నారని గుర్తుచేశారు. పట్టణ ప్రాంతాల్లో 40 శాతానికి పైగా పేద ప్రజలు వీరు విక్రయించే ఆహారంపైనే ఆధారపడతారని అధికారిక లెక్కలు చెబుతున్నాయని, అలాంటి వారిని కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యత అని నాగబాబు వివరించారు.

## నేడు ఏపీకి బిల్ గేట్స్.. ఆ ప్రాజెక్టుపైనా ప్రధానంగా చర్చ

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 15:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు, గేట్స్ ఫౌండేషన్ ఫౌండర్ ఛైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రానున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ పరస్పర సహకారం చేపట్టిన ప్రాజెక్టులను సమీక్షిస్తారు. అలాగే మరిన్ని అంశాలపై పరస్పర సహకారం విస్తరించుకునే విషయాలపై చర్చిస్తారు. ఏపీ పర్యటనలో భాగంగా బిల్ గేట్స్.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లతో భేటీ కానున్నారు. ఏపీ ప్రభుత్వం గేట్స్ ఫౌండేషన్ సహకారం సంజీవని ప్రాజెక్టు చేపడుతోంది. ఈ అంశం మీద ప్రధానంగా చర్చించనున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో టెక్నాలజీ ఆధారిత డయాగ్నస్టిక్ సేవలు, మెడ్ టెక్ కార్యక్రమాలపైనా చర్చించనున్నట్లు తెలిసింది. మరోవైపు బిల్ గేట్స్ ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న రియల్ టైమ్ గవర్నెన్స్ స్టేట్ సెంటర్ కూడా సందర్శిస్తారు, పాలనలో టెక్నాలజీని ఎలా ఉపయోగిస్తున్నారనే అంశాన్ని పరిశీలిస్తారు. ఈ సందర్భంగా రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్స్ పనితీరు, డేటా డ్రివన్ మానిటరింగ్ మెకానిజం గురించి చంద్రబాబు, ఇతర అధికారులు బిల్ గేట్స్‌కు వివరిస్తారు. అనంతరం స్వర్ణాంధ్ర విజన్ 2047 సంస్కరణపైనా చర్చిస్తారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 కింద ప్రజారోగ్యం, వ్యవసాయ రంగం, విద్యారంగంలో తీసుకువచ్చిన సంస్కరణల గురించి బిల్ గేట్స్‌కు వివరిస్తారు. అనంతరం ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని కూడా బిల్ గేట్స్ బృందం పరిశీలించనున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా వ్యవసాయంలో డ్రోన్స్



వినియోగం, ఏఐ పరికరాల ఉపయోగాన్ని పరిశీలించనున్నట్లు తెలిసింది. ఆరోగ్య రంగంలో విప్లవాత్మక సంస్కరణగా ఏపీ ప్రభుత్వం సంజీవని పథకాన్ని రూపొందించింది. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టు కింద గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు, మాతా శిశుసంరక్షణ, వ్యాక్సినేషన్ వంటి సేవలు అందించే ఆలోచనలో ఉన్నారు. సంజీవని ప్రాజెక్టు కింద డిజిటల్ హెల్త్ కార్డుల జారీ ఉంటుంది.

# పెదపాలపర్రులో ముమ్మరంగా బస్సు స్టాండ్ పనులు



**ఏలూరు జిల్లా ముదినేపల్లి:::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి::::** పెదపాలపర్రులో ముమ్మరంగా బస్సు స్టాండ్ పనులు తెలుగుదేశం పార్టీ ముదినేపల్లి మండలాధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి తన తల్లి,తండ్రులైన మైనర్ గా పేరుగాంచిన చల్లగుళ్ల నాగమల్లేశ్వరరావు,సత్యవతి దంపతుల పేరుపై వివిధ పనులపై ప్రయాణికులకు వేచి ఉండటానికి రానున్న వేసవి కాలం,వర్షాకాలం లోనూ,ప్రయాణం చేసే ప్రజలు ఇబ్బంది పడకుండా బస్సు షేల్టర్ ని నిర్మిస్తున్నారు. శోభనాద్రి చౌదరి తనయుడు ఆదిత్య చౌదరి అధ్యక్షతన బస్సు స్థాండు పనులను స్వయంగా పరిశీలిస్తూ,నాణ్యతా,నిర్మాణం లో రాజీ పడకుండా పటిష్టమైన దృడత్వముగాను నిర్మిస్తూన్నామని, గ్రామం ప్రజలు,విద్యార్థిని, విద్యార్థులు, వృద్దులు బస్సులకోసం నిల్చొని వేచి చూస్తూ ఇబ్బందులు పడుతున్నారని,వారికి ఇబ్బందులు కలగకూడదని,జాతీయ రహదారి విస్తీర్ణములో భాగంగా బస్సు స్టాండు ని తొలగించిన దర్మిలా, తమ సొంతంగా ప్రజా అవసరాల దృష్ట్యా నూతన బస్సు షెల్టర్ నిర్మిస్తున్నామన్నారు.

# మహాశివరాత్రి వేడుకల్లో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్..

### నేత్రపర్వంగా వెల్వడం తిరునాళ్ళు-దేదీప్యమానంగా వెలిగిన ప్రభలు.. పోటేత్తిన భక్త జనం..శివుడికి ప్రత్యేక పూజలు..

**ఎన్టీఆర్ జిల్లా, మైలవరం, ఫిబ్రవరి 15,(క్రైం కౌంటర్ డెస్క్):** వెల్వడం గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న తిరునాళ్ల మహోత్సవాల్లో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ఆదివారం రాత్రి పాల్గొన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వెల్వడంలో తిరునాళ్ళ కన్నులపండువగా జరుగుతున్నాయి. శివనామస్మరణతో వెల్వడం గ్రామం మార్మోగింది.ఈ ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు వరి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ బాల కోటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. నేత్రపర్వంగా నిర్వహించిన ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ భోళా శంకరుని ఆశీస్సులతో సమస్త ప్రాణకోటి సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.వెల్వడంకు చెందిన ప్రముఖులు, ప్రవాస భారతీయులు, పరిసర గ్రామాల ప్రజలు, బంధుమిత్రులు, భక్తుల రాకతో గ్రామంలో కోలాహల వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రభల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా మారింది. దేదీప్యమానంగా వెలిగిపోతున్న ప్రభల ఊరేగింపును చూసేందుకు భక్తజనం పోటెత్తారు. ఈ కారిక్రమానికి మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు తో పాటు సీనియర్ నాయకులు కోమటి సుధాకరరావు, మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ),తదితరులతో పాటు వేలాది భక్తులు పాల్గొన్నారు.

# కాటమక్షేత్రంలో శివరాత్రి వేడుకలు



**క్రైం కౌంటర్ న్యూస్,** తాడిమర్రి, ఫిబ్రవరి 15 మండలంలోని కాటకోటేశ్వర క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలు కన్నుల పం డువగా సాగాయి. టీడీపీ నియోజకవర్గం ఇనచార్జ్ పరిటాల శ్రీరామ్ చొరవతో పాటు కూట మి నాయకులు పలు మార్లు చ ర్చలు జరిపి సమస్యను పరిష్క రించడంతో దేవాదాయశాఖ ఆ ధ్వర్యంలో ఉత్సవాలకు అన్ని ఏ ర్పాట్లు పూర్తిచేశారు. ఎస్పీ సతీశ కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్పీ అంకితా సురాన ఆదివారం కాట కోటేశ్వరాన్ని, చిల్లవారిపల్లిని సందర్శించి భద్రతా విషయంలో పోలీసులకు సూచనలు చేశారు. ఉదయం 7గంటల నుంచే కాటమ క్షేత్రం, చిల్లవారిపల్లిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. చిల్లవారిపల్లి నుంచి స్వామివారి ఆభరణాలను గుర్రాలపై, ఎలవగంపలో ఉంచి కాటకోటేశ్వర క్షేత్రానికి బయలు దేరారు. సోమవారం తెల్లవారు జామునకు కాటకోటేశ్వర క్షేత్రానికి చేరుకోనున్నాయి. ఆదివారం మధ్యా హ్నం మంత్రి సత్యకుమార్యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు, ఆలయ అదికారులు, సభ్యులతో చర్చ లు జరిపారు. అన్నదాన కేంద్రంలో మంత్రి స్వయంగా అన్నదానం చేసి, రూ.లక్ష విరాళం అందజేశారు. అనంతరం తాడిమర్రిలోని శివాలయాన్ని మంత్రి సందర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డిశ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్, సాయి, బీజేపీ నాయకులు రాము, ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి కాసరనేనివారిపాలెంలో పర్యావరణహిత కాటన్ బ్యాగుల పంపిణీ..

## 'ఎకో ఫ్రెండ్లీ కాటన్ బ్యాగ్స్' పంపిణీ చేసిన కాసారనేని కృష్ణప్రసాద్..





**కృష్ణ జిల్లా,కంకిపాడు,ఫిబ్రవరి 15(క్రైం కౌంటర్ డెస్క్):** మండలం లోని కాసరనేనివారిపాలెం గ్రామంలో స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు 500 పర్యావరణహిత కాటన్ బ్యాగులను పంపిణీ చేశారు.'ఎకో ఫ్రెండ్లీ కాటన్ బ్యాగ్స్' అధినేత లయన్ కాసరనేని కృష్ణప్రసాద్ వరి తాతయ్య , నాయనమ్మ స్వర్గీయ కాసరనేని వెంకట కృష్ణయ్య, బసవమ్మ జ్ఞాపకార్థం ఈ బ్యాగులను ప్రత్యేకంగా ముద్రించి ఉచితంగా అందజేశారు. ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులందరికీ అవగాహన కల్పిస్తూ వీటిని పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ క్లబ్ సెక్రటరీ లయన్ ఇంజనీర్ రావి సురేష్ బాబు, కాసరనేని విఠల్ రావు, ఇరుకులపాటి ప్రసాద్, పూజారి శ్రీనివాసాచార్యులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# శైవక్షేత్రాల్లో శివరాత్రి శోభ



**క్రైం కౌంటర్ న్యూస్,**పర్చూరు/కారంచేడు, ఫిబ్రవరి 15 మహాశివరాత్రి పర్వదిన వేడుకలను పర్చూరు నియోజకవర్గ పరిధిలోని శివాలయాల్లో విశేష పూజలు చేశారు. వేకువజాము నుంచే ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. చెరుకూరు అగస్త్రేశ్వరస్వామి, పర్చూరు భీమేశ్వరస్వామి, అడుసుమల్లి గౌరీ శంకరస్వామి, నూతలపాడు కోటేశ్వరస్వామి, కారంచేడులోని మల్లే శ్వరస్వామి, కట్టమల్లేశ్వరస్వామివార్ల ఆలయాల్లో మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు పర్చూరు గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాణాధికారి దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో రుద్రాభిషేకం, బిల్వార్చన, లింగార్చన వంటి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.మార్టూరు : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం వేకువజాము నుంచి శివాలయాలకు భక్తు లు బారులు తీరారు. పట్టణంలోని నేతాజీనగర్ సమీపంలోని ఘట్టేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా ఆలయం ఆవరణలోని శివలింగానికి భక్తులుపూలతో, పాలతో అభిషేకం చేశారు. జాతీయరహదారి పక్కన ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలు చేశారు. నాగరాజుపల్లి శివాలయంలో యద్దనపూడి అనంతవరం గ్రామంలో శ్రీగంగాపార్వతీ భోగమల్లేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజలు జరిగాయి. ఇంకొల్లు : మండలంలోని శివాలయాలు మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం శివనామస్మరణతో మార్మోగాయి. ఇంకొల్లు, కొణికి, పావులూరు, భీమవరం గ్రామాలలోని శివాలయాలను విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి శివాలయాల్లో భక్తులు అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. గంగవరం శివాలయ ఆవరణలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఇంకొల్లు భీమలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రసాదాలను పంపిణీ చేశారు. భీమవరం పుట్టవద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.చినగంజాం : మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయం, కొత్తపాలెం గ్రామంలోని బాలకోటేశ్వర స్వామి ఆలయాలలో మహాశివరాత్రి తిరునాళ్లను ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. భక్తులు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. లింగోద్భవ కాలం నుంచే భక్తులు కైలాసనాథుని దర్శించుకొన్నారు. ఆలయాల వద్ద డిజిటల్ విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన శివపార్వతులు, కనకదుర్గ అమ్మవారు, లక్ష్మీదేవి, విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వామి, దేవాలయాల కటౌట్‌లు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తిరునాళ్ల సందర్భంగా రామకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఎనిమిది భారీ డిజిటల్ ప్రభలు, బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద ఆరు భారీ విద్యుత్ ప్రభలను పోటాపోటీగా ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రభల వద్ద టీవీ కళాకారులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ యాంకర్‌లచే నిర్వహించిన మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు భక్తులను ఆలరింపజేశాయి. కడవకుదురు గంగా పార్వతి గోకర్ణేశ్వరస్వామి, చినగంజాం గంగా పార్వతి సమేత చిదంబరేశ్వరాలయం, పెదగంజాం ఈశ్వరాలయం, సంతరావూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా చినగజాంలో చీరాల డీఎస్పీ మహమ్మద్ మెయిన్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయంలో, హరిహర సుత్ర అయ్యప్పస్వామిని, కొత్తపాలెం గ్రామంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయాలలోని స్వామి వార్లను ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరు దేవాలయాల కమిటి చైర్మన్‌లు డాక్టర్ టీ.ఎస్.ఆర్.ఆంజనేయులు, కుక్కల రామకృష్ణారెడ్డి, చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం'లో గేట్స్ టెక్నాలజీ!

### సామాన్యుడి చెంతకు అంతర్జాతీయ వైద్యసేవలు
### 'గేట్స్' సహకారంలో ఏపీలో డిజిటల్ హెల్త్
### ఇప్పటికే కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా 'సంజీవని'
### రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళికలు
### మరింత సహకారం కోరనున్న సీఎం చంద్రబాబు
### ప్రజారోగ్యంపైనే ఫోకస్

**క్రైం కౌంటర్ న్యూస్,** అమరావతి, ఫిబ్రవరి 15ఆరోగ్య రంగంలో సాంకేతిక విప్లవం ద్వారా సామాన్యులకు మెరుగైన, సత్వర వైద్యసేవలందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలోని ఆరోగ్యవ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధంచేసింది. రాష్ట్రంలో విద్య,వైద్య, వ్యవసాయరంగాల్లో గేట్స్ ఫౌండేషన్ ఇప్పటికే ఇస్తున్నసహకారంతోపాటు టెక్నాలజీ పరంగా మరింత సహకారం అందించేక్రమంలో సీఎం చంద్రబాబు ఆహ్వానం మేరకు నేడు గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ఏపీ వస్తున్నారు. ఈసందర్భంగా ఆయన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అమలవుతున్న ఆధునిక పద్ధతులు, పాటించాల్సినవిధానాలపై ప్రభుత్వానికి కీలకసూచనలు చేయనున్నారు. ముఖ్యంగా జబ్బుల బారినపడిన వారికి వైద్యం అందించే సంప్రదాయ విధానానికి భిన్నంగా.. వ్యాధులు సోకడాన్ని ముందుగానే పసిగట్టి, వాటి నివారణా చర్యలతో పాటు ప్రజల ప్రస్తుత ఆరోగ్య స్థితిగతుల్ని వ్యక్తిగతంగా సమగ్రంగా పరీక్షించి, వారికి జబ్బులొచ్చే అవకాశాన్ని ముందుగానే హెచ్చరికలు చేయడం, వ్యక్తిగత హెల్త్ కార్డుల్ని రూపొందించడం, డిజిటల్ ఆరోగ్య సేవలు (టెలిమెడిసిన్) అందించే దిశగా వైద్య ఆరోగ్య వ్యవస్థను ప్రక్షళన చేయాలన్న అంశాలపై కీలకమైన నిర్ణయాలు తీసుకోనున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య సంరక్షణకు ఉన్న విధానాలు, పద్ధతులను సమగ్రంగా సమీక్షించి ఆరోగ్యాంధ్ర సాధనకు చేపట్టాల్సిన విధానాలపై నివేదించేందుకు గేట్స్ ఫౌండేషన్ సూచనల మేరకు 10 మంది అంతర్జాతీయ నిపుణులతో ఒక ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై సీఎం చంద్రబాబు బిల్‌గేట్స్‌కు వివరించనున్నారు. అంతేకాకుండా గేట్స్ ఫౌండేషన్ సూచించిన మేరకు వివిధ పథకాల అమలుకు భాగస్వామ్యుల ద్వారా కార్యాచరణను ప్రారంభించడంతో పాటు ఇంటిగ్రేటేడ్ విధానంలో సాంకేతిక సహకారంతో వివిధ ఆరోగ్య కేంద్రాల సమన్వయంతో రియల్ టైమ్‌లో ప్రజల ఆరోగ్య భద్రత కోసమే ప్రత్యేకంగా సంజీవని పథకాన్ని ప్రారంభించింది. చిత్తూరు జిల్లా కుప్పంలో పైలట్ ప్రాజెక్టును అమలు చేసి, ఇప్పుడు చిత్తూరు జిల్లాకు విస్తరించింది. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. దీనికి గేట్స్ ఫౌండేషన్ సహకారం మరింత కావాలని ప్రభుత్వం కోరనుంది.

ఆపై ఆరోగ్యశాఖను ఆర్టీజీఎ?సలోని అవేర్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానం చేసి వ్యాధులు ప్రబలటాన్ని ముందుగానే పసిగట్టే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. స్థూలంగా డేటా ఆధారిత ముందస్తు వ్యూహాలు, విధానాల రూపకల్పనకు గేట్స్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యం తోడ్పడుతుంది. ఏఐ ఆధారిత డయగ్నోస్టిక్ పరీక్షలు, సంచార పరీక్షా కేంద్రాల్లో సులువుగా నిరంతరం వాడే పరికరాలు, దూర ప్రాంతాల్లో వైద్యం, టెలిమెడిసిన్‌కు సంబంధించిన ఉపకరించే పరికరాల ఎంపికకు గేట్స్ ఫౌండేషన్ టెక్నికల్ సపోర్టు అందిస్తుంది. వైద్య రంగంలో టెక్నాలజీ అవసరం: సత్యకుమార్ వైద్య రంగంలో ఆశించిన మార్పులను సాధించడానికి, వైద్యం అందరికీ సులువుగా అందించడానికి టెక్నాలజీ సహకారం ఎంతో అవసరం. ఈ దిశగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ముందుకు సాగుతున్నాం. ఇందులో భాగంగాఏఐ ఆధారిత జాతీయ విధాన రూపకల్పన దిశగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విజయవాడలో వివిధ రాష్ట్రాలతో మొదటి విడత చర్చల జరిపాం. ఆరోగ్యశాఖకు టెక్నాలజీ అనుసంధానంపై ఫౌండేషన్ సహకారం తీసుకుంటాం.

# అక్కడంతా 'మామూలే'...

**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనికోరేటు వసూలు**
**అధికారుల రూటే సెపరేటు**
**ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ల ద్వారా దందా**
**అన్ని ధ్రువపత్రాలు ఉన్నా చేయి తడపాల్సిందే**
**లేకుంటే రోజుల తరబడి తిరగాల్సిందే**



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 15:** - మెంటాడ గ్రామానికి చెందిన వృద్ధురాలు జి.రాములమ్మ కొద్ది రోజుల క్రితం తనకున్న ముప్పావు సెంటు గ్రామ కంఠం భూమిని వేరొకరికి విక్రయించి గజపతినగరం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించేందుకు వెళ్లింది. తహసీల్దార్ సర్టిఫికెట్ లేదని అదనంగా రూ.10 వేలు అడిగారు. ఇవ్వలేనని ప్రాధేయపడినా కనికరించలేదు. స్టాంపు డ్యూటీకీ ఇది అదనం. చేసేదిలేక ఇచ్చుకోక తప్పలేదని ఆమె వాపోతోంది. గజపతినగరం రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటువంటివి మామూలే అని చెబుతున్నారు.

- మెంటాడ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన మీసాల రాములమ్మ ఆంధ్ర రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 19-2లో ఎకరా ఐదు సెంట్లు భూమిని మెంటాడకు చెందిన ఓ వ్యక్తికి గజపతినగరం రిజిస్ట్రార్ కార్యాలయంలో 2005లో రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం జూన్ 2023లో ఆమె మరణించారు. సవరణ పేరుతో కుటుంబ సభ్యులకు తెలియకుండా కొందరు వ్యక్తులు 2025 ఫిబ్రవరిలో 18 సెంట్లు భూమిని డాక్యుమెంట్ రైటర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న రాములమ్మ మనవడు శ్రీనువాసరావు కలెక్టర్, సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుక ఖర్చుకున్న సబ్ రిజిస్ట్రార్ ఆ రిజిస్ట్రేషన్ రద్దుకు ఆదేశించారు.

- మెంటాడ మండలం పెద మేడపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ రెడ్డి ఎర్రనాయుడు కొద్దిరోజులు క్రితం ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కొరకు డాక్యుమెంట్ రైటర్‌ను కలిశారు. వీఆర్‌వో స్థల ధ్రువీకరణ పత్రం చూపించారు. తహసీల్దార్ సర్టిఫికెట్ లేనందున రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసేదిలేక ఇంటిముఖం పట్టారు.

ఇక్కడే కాదు జిల్లాలో అనేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తీరు ఇలాగే ఉంది. ఎప్పటికప్పుడు ఏసీబీ దాడులు జరుగుతున్నా, మీ పనిమీదే... మా పనిమాదే అన్నట్టుగా అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. దీంతో కక్షిదారులకు రిజిస్ట్రేషన్ ఖర్చు రెండుమూడింతలు అదనంగా వదిలిపోతోంది. ఆస్తుల రిజిస్ట్రేషన్ అంటే యజమానులు హడలిపోయే పరిస్థితి దాపురించింది. రిజిస్ట్రార్లు చేతికి అవినీతి మకిలి అంటకుండా తెలివిగా ఆఫీసుల బయట తిష్ఠ వేసి అనధికార డాక్యుమెంట్ రైటర్లను తెరపైకి తెస్తూ వారి డైరెక్షన్లో నడిపిస్తున్నారు. ఏ రిజిస్ట్రేషన్‌కు ఎంత? ఎవరికి ఎంత? పత్రాలు ఉంటే ఎంత? లేకపోతే ఎంత? అనేది లెక్కగట్టి మరీ రైటర్లే డిసైడ్ చేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్ల వద్దే అన్నీ పూర్తయ్యాక డాక్యుమెంట్ ఫైలు అక్కడ్నుంచి రిజిస్ట్రార్ ఆఫీసుకి వెళ్తోంది. ఇటు డాక్యుమెంటేషన్ ఫీజుతోపాటు, ఫార్మాలిటీస్‌లో కొంత కమీషన్ కూడా రైటర్స్‌కు ముడుతుందనేది క్రయవిక్రయదారుల మాట. రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది నెలవారీ జీతభత్యాలను మించి ఆదాయం రావడంతో రిజిస్ట్రేషన్ పార్టీలను ఆకర్షించేందుకు రైటర్లు పోటీపడుతున్నారు. వీరిమధ్య పోటీ ఎంత ఎక్కువగా ఉంటే క్రయవిక్రయదారులను తీసుకొచ్చేతమకు అంత గిట్టుబాటు అవుతున్నదని దళారీలు సంబరపడడం పరిస్థితికి అద్దం పడుతోంది.ఉంటే కొంత.. లేకుంటే చెప్పినంత

గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్‌కు గతంలో వీఆర్వో లేదా గ్రామ కార్యదర్శి సర్టిఫికెట్ సరిపోయేది. అయితే దీనివల్ల అవకతవకలు జరుగుతున్నట్టు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం తహసీల్దార్ లేదా ఆ స్థాయి అధికారి సర్టిఫికెట్ తప్పనిసరి చేసింది. రిజిస్ట్రార్లు దీన్ని కూడా మస్తుగా సొమ్ము చేసుకుంటున్నారు. తహసీల్దార్ సర్టిఫికెట్ జారీకి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని భూముల యజమానులు డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయిస్తే, ఎప్పట్లాగే వీఆర్వో, కార్యదర్శి సర్టిఫికెట్‌తో పని అయ్యేలా చూస్తామని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ ఆస్తి విలువను బట్టి పదినుంచి ఇరవై వేల రూపాయలు రేటు ఫిక్స్ చేసి రిజిస్ట్రార్లకు విషయం వివరిస్తే నిబంధనలను పక్కన పెడుతున్నారు.

- పెళ్లి రిజిస్ట్రేషన్, ఆస్తుల మార్ట్‌గేజ్ అవసరమై వెళ్తే అప్పుడు కూడా 'రేటు'లెక్కగట్టిమరీ పిండేస్తున్నారు. రిజిస్ట్రేషన్, మార్ట్‌గేజ్ ఒకేరోజు జరిగితే మార్ట్ గేజ్ కు కొంత రిబేటు ఇస్తూ ఏదో మహోపకారం చేసినట్టు బిల్డప్ ఇస్తున్నారు.

- రిజిస్ట్రేషన్ ప్రక్రియ సరళీకరణతో ప్రజలకు మేలు చేసేందుకు ప్రభుత్వం ఎన్నెన్ని సంస్కరణలు అమలుచేస్తున్నా అవి బూడిదలో పోసిన పన్నీరు చందంగా నిరర్థకమై క్రయవిక్రయదారులకు కష్టాలను మిగుల్చుతున్నాయి. ఏసీబీ దాడులు జరిగాక కొన్నాళు ఈ వ్యవహారాలు తగ్గాయి. ఇప్పుడు మళ్లీ పుంజుకున్నాయి.

ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటాం కార్యాలయంలో సిబ్బంది ఎవరైనా అదనంగా డిమాండ్ చేస్తే తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాను.

# కల సాకారమయ్యేనా?

**మినీ రిజర్వాయర్ కోసం రైతుల ఎదురుచూపు**
**- రాళ్లగెడ్డపై నిర్మిస్తే 15 వేల ఎకరాలు సస్యశ్యామలం**
**- ఇప్పటికే డిప్యూటీ సీఎం, నీటి పారుదలశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన టీడీపీ నేతలు**
**- బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యమివ్వడంతో చిగురించిన ఆశలు**



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 15:** సీతంపేట మండలం తాడిపాయి, మానాపురం గ్రామాల మధ్యలో ఉన్న కొండల వద్ద మినీ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ రిజర్వాయర్ నిర్మాణం జరిగితే రాళ్లగెడ్డ కుడి , ఎడమ ప్రధాన కాలువల ద్వారా మొత్తం 15 వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరంది భూములన్నీ సస్యశ్యామలమవుతాయి. సీతంపేట మండలంలోని తాడిపాయి, మానాపురం, దుగ్గి, రాయిలంక, వీరఘట్టం మండలంలోని మూలలకం, చినగోరకాలనీ, సంతనర్సిపురం, జియ్యమ్మవలస మండలంలోని అంకవరం, డంగభద్ర, గడసింగుపురం, అర్నాడ, జియ్యమ్మవలస పంచాయతీలకు చెందిన రైతులకు ఎంతో మేలు చేకూరనుంది. మినీ రిజర్వాయర్ కోసం గత వైసీపీ ప్రభుత్వంలో నీటి పారుదలశాఖ అధికారులు రూ.2కోట్లతో ప్రతిపాదనలు పంపించినా ఫలితం శూన్యం. గతంలో ఈ ప్రాజెక్టు విషయంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆధ్వర్యంలో పరిశోధన జరిగింది. అయితే పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తరువాత ఆ ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుతం ఉమ్మడి విజయనగరం జిల్లాలోని బొబ్బిలి నీటి పారుదలశాఖ సర్కిల్ కార్యాలయం సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు ఆ ఫైల్ పంపిస్తే మినీ రిజర్వాయర్ విషయంలో కదలిక ఉంటుందని రైతులు చెబుతున్నారు.

అధ్వానంగా లైనింగ్

రాళ్లగెడ్డ కుడి , ఎడమ ప్రధాన కాలువల పొడవు 11.5 కిలో మీటర్లు. ప్రస్తుతం ఈ కాలువలు అధ్వానంగా ఉన్నాయి. డ్రాపులు, కల్వర్టులు, స్ట్రక్చర్లు, చప్టాలు, మదుములు అన్నీ పాడైపోయాయి. దట్టమైన పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. దీనివల్ల పది వేల ఎకరాలకు కూడా సాగునీరందని పరిస్థితి నెలకొంది. 2014-19 మధ్యలో ఈ కాలువల దుస్థితిని చూసి అప్పటి నీటి పారుదలశాఖ అధికారులే నోరెల్లబెట్టారు. ఆ తరువాత కనీసం ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. నిధులు మంజూరైతే మినీ రిజర్వాయర్ నిర్మాణంతో పాటు నార్త్ ప్రధాన కాలువ పొడవు 5.5 కిలో మీటర్లు, సౌత్ ప్రధాన కాలువ 6 కిలో మీటర్లు లైనింగ్ పూర్తి చేయాల్సి ఉంది.

ప్రభుత్వంపైనే ఆశలు..

రాష్ట్రంలోని ప్రతి ఎకరాకూ సాగునీరందించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు సందర్భాల్లో రైతులకు భరోసా ఇచ్చారు. రెండు రోజుల కిందట ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా సాగునీటి ప్రాజెక్టులకు సముచిత స్థానం కల్పించి అధిక నిధులు మంజూరు చేశారు. దీంతో రాళ్లగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మాణంపై జియ్యమ్మవలస, సీతంపేట, వీరఘట్టం మండలాలకు చెందిన రైతుల్లో ఆశల రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే మినీ రిజర్వాయర్ విషయాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి సహకారంతో ఈ ప్రాంత టీడీపీ నాయకులు, రైతులు తీసుకెళ్లారు. ప్రభుత్వం ఏ మేరకు చర్యలు తీసుకుంటుందో చూడాలి.

మినీ రిజర్వాయర్‌ను నిర్మించాలి..

రాళ్లగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మాణం ఈ ప్రాంత రైతుల కల. ఏడు దశాబ్దాల నుంచి ఎదురుచూస్తున్నారు. వారి కలను సాకారం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మినీ రిజర్వాయర్ నిర్మాణం జరిగితే మూడు మండలాల్లోని 15 వేల ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందుతుంది.

-ఎం.సత్యంనాయుడు, చైర్మన్, వట్టిగెడ్డ ప్రాజెక్టు కమిటీ, జియ్యమ్మవలస

ఆదేశాలు రావాలి

రాళ్లగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మాణం విషయాన్ని ఇటీవలే కొందరు నాయకులు, రైతులు మా దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం, మాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాలి.

# హరహర మహాదేవ..



**శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు**
**కల్యాణపులోవ, పంచదార్ల, ధారమఠం ఆలయాలకు పోటెత్తిన భక్తులు**
**ఇతర శైవక్షేత్రాలు సైతం భక్తులతో రద్దీ**
**ఘనంగా మహాశివరాత్రి వేడుకలు**
**కల్యాణపులోకు పోటెత్తిన భక్తజనం**
**పోతురాజుబాబు, పెద్దింటమ్మవార్లను దర్శించుకొని పూజలు**
**రిజర్వాయర్ స్నానఘట్టాలు కిటకిట**

రావికమతం, ఫిబ్రవరి 15 భక్తజన కోటితో మండలంలోని కల్యాణపులోవ కిక్కిరిసిపోయింది. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం, జలాశయం పరిసరాలు మార్మోగాయి. ఉమ్మడి జిల్లాతోపాటు ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయంలో శివలింగం రూపంలో వున్న పోతురాజుబాబును, పెద్దింటమ్మవార్లను దర్శించుకోవడానికి బారులు తీరారు. వీరిలో అత్యధికులు తొలుత జలాశయంలో పుణ్యస్నానాలు ఆచరించారు. దీంతో స్నానఘాట్‌లు రద్దీగా మారాయి.

పోతురాజుబాబు, పెద్దింటమ్మను దర్శించుకోవడానికి మూడు రోజుల్లో మూడు లక్షల మంది భక్తులు తరలివస్తారన్న అంచనాతో భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. వాహనాల నిలుపుదల కోసం ఆలయ పరిసరాల్లో 45 ఎకరాల మేర చదును చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అసాధారణ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్నానఘాట్‌ల వద్ద గత ఈతగాళ్లను అందుబాటులో వుంచారు. క్యూలో నిల్చున్న తరువాత పోతురాజుబాబు, పెద్దింటమ్మను దర్శించుకోవడానికి రెండు నుంచి నాలుగు గంటల సమయం పట్టిందని భక్తులు చెబుతున్నారు. అనకాపల్లి డీస్పీ శ్రావణి పర్యవేక్షణలో కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు చేపట్టారు. శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ రమేశ్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, తదితరులు పోతురాజుబాబును, పెద్దింటమ్మవార్లను దర్శించుకొని పూజలుచేశారు.

పంచదార్ల క్షేత్రానికి భక్తుల తాకిడి

ఉమాధర్మలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు

రాంబిల్లి, ఫిబ్రవరి 15: హరహర మహాదేవ శంభో శంకర అంటూ శివనామ స్మరణతో పంచదార్ల పుణ్యక్షేత్రం మార్మోగింది. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం పంచదార్ల ఆలయానికి ఉమ్మడి జిల్లా నలుమూలలు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తొలుత రాధామాధవస్వామి ఆలయ గర్భంలో ప్రవహిస్తున్న ఆకాశ ధార వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించిన, అనంతరం ఫణిగిరిపై ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అంతకు ముందు తెల్లవారుజామున ప్రధాన అర్చకులు ఆలయంలో ధర్మలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాధారణ భక్తులకు దర్శనాలు ప్రారంభించారు. కాగా ఇదే క్షేత్రంలో ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామిని, సహస్ర లింగేశ్వరస్వామిని, రాధామాధవస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఎక్కువ సమయం క్యూలో వుండాల్సి వచ్చిందని భక్తులు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ ఈవో తేజ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు.

## ఢిల్లీ వేదికగా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్.. చివరి నిమిషంలో ఎన్విడియా సీఈఓ పర్యటన రద్దు

**క్రైం కౌంటర్ న్యూస్,** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'ను నిర్వహిస్తోంది. ఈ నెల 16 నుంచి 20 వరకు దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న ఈ మహా సదస్సు కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు, ఏఐ వల్ల కలిగే సామాజిక ప్రయోజనాలే ప్రధాన ఎజెండాగా ఈ ఐదు రోజుల సదస్సు కొనసాగనుంది.

అయితే, ఈ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలవాల్సిన ఎన్విడియా సీఈఓ జెన్‌సెన్ హువాంగ్ తన పర్యటనను అకస్మాత్తుగా రద్దు చేసుకోవడం చర్చనీయాంశమైంది. అనివార్య కారణాల వల్ల ఆయన ఈ సదస్సుకు హాజరు కాలేకపోతున్నట్లు ఆ సంస్థ అధికారికంగా ధృవీకరించింది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ చిప్‌ల తయారీలో అగ్రగామిగా ఉన్న ఎన్విడియా అధినేత రాక కోసం ఎదురుచూసిన టెక్ ప్రియులకు ఈ వార్త కొంత నిరాశ కలిగించిందనే చెప్పాలి. ఈ సమ్మిట్ పరిధి అత్యంత భారీ స్థాయిలో ఉండబోతోంది. దాదాపు 100 దేశాల నుంచి సుమారు 35,000 మంది ప్రతినిధులు ఈ వేదికపై సందడి చేయనున్నారు. గ్లోబల్ టెక్ దిగ్గజాలు, అంకుర సంస్థల ప్రతినిధులు, మరియు ప్రభుత్వ విధానకర్తలు ఒకే చోట చేరి కృత్రిమ మేధ భవిష్యత్తుపై లోతైన చర్చలు జరపనున్నారు. ఇంత భారీ స్థాయిలో ఒక ఏఐ సదస్సు నిర్వహించడం భారతదేశ సాంకేతిక సత్తాకు నిదర్శనంగా నిలుస్తోంది. జెన్‌సెన్ హువాంగ్ రాకపోయినప్పటికీ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్, మరియు గూగుల్ అధినేత సుందర్ పిచాయ్ వంటి దిగ్గజాలు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. వీరి రాకతో ఢిల్లీ వేదిక టెక్నాలజీ హబ్‌గా మారనుంది. మేధోమథనం, ఆవిష్కరణలు మరియు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ఈ సమ్మిట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

## భక్తులకు సౌకర్యాల కల్పనే లక్ష్యం : మంత్రి

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 15:** ముదిగుబ్బ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని ఆయన ఆదివారం మండల పరిధిలోని సంకేపల్లి సమీపంలోని వీర నారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు సౌకర్యవంతంగా ఆలయానికి చేరుకునే విధంగా రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, రూ.14 లక్షల వ్యయంతో నిర్మించిన టాయిలెట్లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సినిమా



## ఉదయ్ కిరణ్ భార్య ఇప్పుడు ఎలా ఉందో.? ఏం చేస్తుందో తెలుసా.?

ఎంతోమంది హీరోలు తెలుగులో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. యంగ్ హీరోలు కొత్త కొత్త సినిమాలతో రాణిస్తున్నారు. కొంతమంది హీరోలు. అయితే ఒకప్పుడు స్టార్ హీరోలు అవుతారు అనుకున్న వారు ఊహించని ఫ్లాప్ లతో కనిపించకుండా పోయారు. కథల ఎంపికలో తప్పటడుగు వేయడంలోనో.. లేక మరో కారణంతోనో చాలా మంది హీరోల సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ఉదయ్ కిరణ్ కెరీర్ కూడా అలానే జరిగింది. తక్కువ సమయంలో స్టార్ హీరోగా ఎదిగాడు ఉదయ్ కిరణ్. తేజ దర్శకత్వంలో 2000 సంవత్సరంలో వచ్చిన చిత్రం అనే సినిమాతో హీరోగా పరిచయం అయ్యాడు ఈ హీరో. తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సొంతం చేసుకున్నాడు ఉదయ్ కిరణ్..తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకొని అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు ఉదయ్ కిరణ్. తేజ దర్శకత్వం వహించిన చిత్రం సినిమా తర్వాత నువ్వు నేను, మనసంతా నువ్వే, కలుసుకోవాలని, శ్రీరామ్, హోలీ, నీ స్నేహం లాంటి సినిమాలతో వరుస విజయాలను అందుకున్నాడు ఉదయ్ కిరణ్. అదే సమయంలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ను సొంతం చేసుకున్నాడు ఉదయ్. అయితే ఊహించని విధంగా ఉదయ్ సినిమాలు వరుసగా ఫ్లాప్ అవుతూ వచ్చాయి. వరుసగా ఫ్లాప్స్ రావడంతో ఉదయ్ కిరణ్ డైలమాలో పడ్డారు. తెలుగులోనే కాదు తమిళ్ లోనూ సినిమా చేసి అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. అక్కడ పోయి అనే సినిమాతో తమిళ్ ఇండస్ట్రీలోకి కూడా అడుగు పెట్టాడు ఉదయ్ కిరణ్.అయితే వరుస ఫ్లాప్ లు రావడంతో ఉదయ్ కిరణ్ కెరీర్ ఆందోళల్లో పడింది. చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టడంతో ఆయనకు అవకాశాలు తగ్గుతూ వచ్చాయి. ఆ తర్వాత ఉదయ్ కిరణ్ విషితను వివాహం చేసుకున్నాడు. ,వీరి వివాహం గ్రాండ్ గా జరిగింది. సినీ సెలబ్రెటీలు కూడా వీరి వివాహానికి హాజరయ్యారు. పెళ్లి తర్వాత ఈ ఇద్దరూ చాలా సంతోషంగా గడిపారు. పెళ్లి తర్వాత ఆయనకు అవకాశాలు తగ్గడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు ఉదయ్. భార్య జాబ్ చేస్తుండటంతో ఆయన ఇంట్లో ఖాళీగా ఉండే పరిస్థితి ఏర్పడింది. చివరకు ఆయన మనస్తాపంతో ఆత్మహత్య చేసుకొని కన్నుమూశారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు ఉదయ్. ఆయన మరణంతో ఫ్యాన్స్ ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికి ఆయన ఫ్యాన్స్ ఉదయ్ ను మిస్ అవుతున్నారు. అయితే ఉదయ్ కిరణ్ భార్య విషిత ఇప్పుడు ఏం చేస్తుందో తెలుసా..? ఆమె ఇప్పుడు ఎక్కడ ఉన్నారు.? ఏం చేస్తున్నారాని కొందరు నెటిజన్స్ ఆరా తీస్తున్నారు. విషిత ఇప్పుడు సాఫ్ట్ వేర్ జాబ్ చేస్తుంది. ఉదయ్ కిరణ్ మరణం తర్వాత ఆమె మరో వివాహం చేసుకోలేదు. జాబ్ చేసుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తున్నారు విషిత.





## ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ నీరు తాగితే శరీరంలో జరిగే అద్భుతాలివే..

మన వంటిల్లే ఒక అద్భుతమైన ఔషధాల గని అని పెద్దలు చెబుతుంటారు. ఆ మాట అక్షర సత్యమని నిరూపించే అతిముఖ్యమైన ద్రవ్యం వెల్లుల్లి నీరు. సాధారణంగా వెల్లుల్లిని కూరలకు రుచి కోసం వాడతాం.. కానీ ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఒక గ్లాసు వెల్లుల్లి నీటిని తాగితే శరీరంలో ఎలాంటి విప్లవాత్మక మార్పులు వస్తాయో తెలుసా? మీ రోగనిరోధక శక్తిని రెట్టింపు చేయడం నుంచి గుండెను పదిలంగా ఉంచడం వరకు.. ఈ చిన్న అలవాటు ఒక నేచురల్ షీల్డ్‌లా పనిచేస్తుంది. అసలు వెల్లుల్లి నీటిలో ఉన్న ఆ మ్యాజిక్ ఏంటీ..? బరువు తగ్గాలనుకునే వారు, బీపీతో ఇబ్బంది పడేవారు దీనిని ఎందుకు అమృతంలా భావిస్తారు? వంటింటి వైద్యంలోని ఈ అద్భుత రహస్యాలు, వెల్లుల్లి నీటిని పర్‌ఫెక్ట్‌గా ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం.

వెల్లుల్లి నీటితో కలిగే 6 అద్భుత ప్రయోజనాలు

ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ

వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ అనే సమ్మేళనం ఒక నేచురల్ యాంటీ బయాటిక్‌లా పనిచేస్తుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచి వైరస్‌లు, బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని రక్షిస్తుంది. తరచుగా జలుబు, దగ్గుతో బాధపడేవారికి ఇది గొప్ప ఉపశమనం.

గుండె పదిలం -- బీపీ నియంత్రణ

రక్తపోటు సమస్యతో బాధపడేవారికి వెల్లుల్లి నీరు ఒక వరప్రసాదం. ఇది రక్త నాళాలను వ్యాకోచింపజేసి, రక్త ప్రసరణను సులభతరం చేస్తుంది. అంతేకాకుండా శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని అడ్డుకుంటుంది.వెయిట్ లాస్ -- మెటబాలిజం పెరుగుదల

బరువు తగ్గాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే మీ డైట్‌లో వెల్లుల్లి నీటిని చేర్చుకోండి. ఇది శరీరంలోని జీవక్రియను వేగవంతం చేసి, అదనపు కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది.

జీర్ణక్రియ మెరుగుపడుతుంది

కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలకు వెల్లుల్లి నీరు చెక్ పెడుతుంది. ఇది ప్రేగులలోని హానికరమైన వ్యర్థాలను తొలగించి జీర్ణవ్యవస్థను శుభ్రపరుస్తుంది.

దృఢమైన ఎముకలు

వెల్లుల్లిలో కాల్షియం, మాంగనీస్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల సాంద్రతను పెంచి, వయసు పెరిగే కొద్దీ వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యల నుండి కాపాడుతాయి.

ఊపిరితిత్తుల ఆరోగ్యం

వెల్లుల్లిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు శ్వాసనాళాల్లోని వాపును తగ్గిస్తాయి. ఆస్తమా లేదా ఇతర శ్వాసకోస సమస్యలు ఉన్నవారికి ఇది శ్వాస తీసుకోవడాన్ని సులభతరం చేస్తుంది.

వెల్లుల్లి నీటిని ఎలా తయారు చేయాలి?

స్టెప్ 1: రెండు వెల్లుల్లి రెబ్బలను తీసుకుని పొట్టు తీసి, వాటిని కొద్దిగా దంచండి.

స్టెప్ 2: దంచిన వెల్లుల్లిని ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో కలపండి.

స్టెప్ 3: ఒక 5-10 నిమిషాలు అలాగే ఉంచి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ నీటిని త్రాగాలి.



## రోజంతా గోరువెచ్చని నీరు తాగితే ఏమవుతుంది..?

నీరు శరీర దాహాన్ని తీర్చడమే కాకుండా రక్తంలో కలిసిపోయి ప్రతి కణానికి ఆక్సిజన్‌ను సరఫరా చేసే జీవనాధారం. మానవ శరీరం 70 శాతం నీటితోనే నిర్మితమై ఉంటుంది. అయితే ఏ రకమైన నీరు ఎప్పుడు తాగాలి అనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. మన పూర్వీకుల నుండి వస్తున్న ఉదయం గోరువెచ్చని నీరు తాగే అలవాటు కేవలం సంప్రదాయం మాత్రమే కాదు అదొక అద్భుతమైన ఆరోగ్య ప్రక్రియ అని ఆయుర్వేదం చెబుతోంది.జీర్ణ అగ్నిని రగిలించే గోరువెచ్చని నీరు

ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణ అగ్ని యాక్టివేట్ అవుతుంది. ఇది శరీరంలోని కఫ దోషాన్ని సమతుల్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

గోరువెచ్చని నీటితో కలిగే టాప్ 4 ప్రయోజనాలు:

జీర్ణక్రియ మెరుగు: తిన్న ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం సమస్యను వదిలించడానికి ఇది చక్కటి పరిష్కారం.టాక్సిన్స్ తొలగింపు: శరీరం లోపల పేరుకుపోయిన హానికరమైన విష పదార్థాలను బయటకు పంపి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. బరువు తగ్గడం: క్రమం తప్పకుండా వేడి నీటిని తాగడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరిగి, కొవ్వు కరగడానికి సహాయపడుతుంది.

శ్వాసకోశ సమస్యలకు చెక్: గొంతులో పేరుకుపోయిన కఫాన్ని వదులు చేసి, దగ్గు, జలుబు నుండి ఉపశమనాన్ని ఇస్తుంది. అధిక దాహం: విపరీతమైన డీహైడ్రేషన్ ఉన్నప్పుడు గోరువెచ్చని నీరు తాగితే శరీరంలోని తేమ మరింత తగ్గే అవకాశం ఉంది.

## ఏందిరా సామీ ఇది.

అభిషేక్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత దారుణమైన పతనాన్ని ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచ కప్ దానికి నిదర్శనంగా మారింది. ఖూూతో జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో డకౌట్ అయిన అభిషేక్.. ఆదివారం కొలంబోలో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ ఇదే రిపీట్ చేశాడు. కెప్టెన్ సల్మాన్ ఆఘా పాకిస్తాన్ తరపున బౌలింగ్ దాడిని ప్రారంభించడంతో అభిషేక్ పై పాకిస్తాన్ పూర్తి ప్లాన్ తో వచ్చిందని అర్థమైంది. అతను వరుసగా రెండవ మ్యాచ్ లో నాలుగు బంతులు ఆడి డకౌట్ కావడంతో పాకిస్తాన్ ప్లాన్ అద్భుతంగా పనిచేసింది.గత 6 ఇన్నింగ్స్‌లలో అభిషేక్ శర్మకు ఇది 4వ డకౌట్. ఈ క్రమంలో అభిషేక్ శర్మ చాలా అవాంఛిత జాబితాలలోకి ఎంట్రీ ఇచ్చాడు. అలాగే కొన్ని మరపురాని రికార్డులను సాధించడం గమనార్హం.

టీ20 ప్రపంచకప్ లో మొదటి రెండు మ్యాచ్‌లలో డకౌట్ అయిన బ్యాటర్లు..

ఈ అవాంఛిత ఘనత సాధించిన మూడో ఆటగాడిగా అభిషేక్ నిలిచాడు. ఆశిష్ నెహ్రా, బంగ్లాదేశ్ కు చెందిన ఇమ్రుల్ కయేస్ లతో కలిసి అభిషేక్ తమ తొలి రెండు టీ20 ప్రపంచకప్ ఇన్నింగ్స్ లలో డకౌట్ గా ఔటైన బ్యాట్స్ మెన్ గా నిలిచాడు.ఈ భారత స్టార్ టీ20 ప్రపంచ కప్‌లో కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. ఇంకా తన ఖాతా తెరవలేదు. పరుగుల ఖాతా కోసం వేచి చూస్తున్నాడు.

టీ20 ప్రపంచకప్‌లలో భారత్ తరపున అత్యధికంగా డకౌట్ అయిన ప్లేయర్లు..

ఆశిష్ నెహ్రా 3 డకౌట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. అభిషేక్ గౌతమ్ గంభీర్, రవీంద్ర జడేజా, విరాట్ కోహ్లీ, శివం దూబే వంటి వారి జాబితాలో రెండు డకౌట్లతో చేరాడు. ఈ జాబితాలో కూడా నెహ్రా అగ్రస్థానంలో ఉన్నాడు. టీ20 ప్రపంచ కప్‌లలో అత్యధికంగా డకౌట్ అయిన భారతీయుల జాబితాలో అభిషేక్ కొంతమంది స్టార్ పేయర్లతో కలిసి ఈ అవాంఛిత కంపెనీలోకి ప్రవేశించాడు.

టీ20ల్లో భారత్ తరపున ఓపెనర్లుగా అత్యధికంగా డకౌట్ అయిన ఆటగాళ్లు..

టీ20ల్లో ఓపెనర్‌గా రోహిత్ శర్మ 10 డకౌట్లు నమోదు చేయగా, అభిషేక్ శర్మ, సంజు సామ్సన్‌ను అధిగమించి టీ20ల్లో అత్యధిక డకౌట్లు (5) అయిన భారత బ్యాట్స్‌మన్‌గా సంయుక్తంగా రెండవ స్థానంలో నిలిచాడు.

భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 10 డకౌట్లతో మొదటి స్థానంలో నిలిచాడు. అభిషేక్ మరచిపోయిన ఓపెనర్ కేఎల్ రాహుల్‌తో కలిసి ఇప్పుడు రెండవ స్థానాన్ని ఆక్రమించాడు.




## టీమిండియా ప్లేయింగ్ 11 నుంచి స్టార్ ప్లేయర్ ఔట్..

భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య టీ20 ప్రపంచ కప్ 2026 మ్యాచ్ కు కొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. కానీ, మ్యాచ్ కు ముందు, భారత శిబిరం నుంచి కీలక వార్తలు వెలువడుతున్నాయి. ఈ మ్యాచ్ లో అర్ష్ దీప్ సింగ్ ఆడడని వార్తలు వినిపిస్తున్నాయి. భారత జట్టు అతని స్థానంలో కుల్దీప్ యాదవ్ కు అవకాశం ఇవ్వబోతోంది. ఇంకా, ప్లేయింగ్ ఎలెవన్ లో మరో మార్పు ఖాయం అని తెలుస్తోంది. సంజు శాంసన్ స్థానంలో అభిషేక్ శర్మ వచ్చాడు. అనారోగ్యం కారణంగా అభిషేక్ మునుపటి మ్యాచ్ కు దూరమయ్యాడు. కానీ, ఇప్పుడు ఫిట్ గా ఉన్నాడు. కానీ ప్రశ్న ఏమిటంటే.. అర్ష్ దీప్ సింగ్ ను ఎందుకు తప్పించారు..? అనే సంగతి తెలియాల్సి వచ్చింది.

అర్ష్‌దీప్ సింగ్ ఔట్.. భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య మ్యాచ్ కొలంబోలో జరగనుంది. ఈ మ్యాచ్‌ను కవర్ చేస్తున్న జర్నలిస్టులు ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌కు ఈ మ్యాచ్‌లో అవకాశం ఇవ్వరని చెబుతున్నారు. కొలంబో స్పిన్ అనుకూల పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, భారత జట్టు కుల్దీప్ యాదవ్‌కు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్‌పై కుల్దీప్ యాదవ్ ప్రదర్శన అద్భుతంగా ఉంది. పాకిస్తాన్‌పై అతను నిలకడగా వికెట్లు పడగొట్టిన సంగతి తెలిసిందే.

పాకిస్థాన్ పై కుల్దీప్ యాదవ్ ప్రదర్శన..

పాకిస్తాన్‌తో జరిగిన 9 మ్యాచ్‌ల్లో కుల్దీప్ యాదవ్ 23 వికెట్లు పడగొట్టాడు. అతను ఒకసారి 5 వికెట్లు, ఒకసారి పాకిస్తాన్‌పై 4 వికెట్లు పడగొట్టాడు. పాకిస్తాన్ బ్యాటర్స్ అతని వైవిధ్యాలను అర్థం చేసుకోవడం కష్టం, ముఖ్యంగా బాబర్ ఆజం అయితే చాలా కష్టపడుతుంటాడు.కొలంబోలో స్పిన్నర్ల ఆధిపత్యం..

ముఖ్యంగా, భారత్-పాకిస్తాన్ మ్యాచ్ జరగనున్న కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియం స్పిన్నర్లకు అనుకూలమైన వేదిక. అయితే, పాకిస్తాన్ ఇంకా ఈ మైదానంలో ఆడలేదు. సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన మునుపటి మ్యాచ్‌లో పాకిస్తాన్ బౌలర్లు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఉస్మాన్ తారిక్ 4 ఓవర్లలో 27 పరుగులకు 3 వికెట్లు పడగొట్టాడు. షాదాబ్ ఖాన్ 2 వికెట్లు పడగొట్టాడు.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com